క్లుప్తంగా

ప్రశ్న అర్థం చేసుకుని జవాబు రాయాలి



బలిజిపేట ఉన్నత పాఠశాలలో ఎఫ్ఏ 2పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: విద్యార్థులు ప్రశ్నలను అర్థం చేసుకుని జవాబులు రాయాలని ఎంఈఓ-1సామల సింహాచలం సూచించారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో ఎఫ్ఏ 2పరీక్షలను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదివి వాటికి తగిన జవాబు ఏమిటనేది ఆలోచించి రాయడం విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా చేతిరాత బాగుంటే మంచి మార్కులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉపాధ్యాయుల తొలగింపు మానుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: గురుకులాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల తొలగింపు ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం కోరారు. గతంలోని కాంగ్రెస్, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాలు ఆయా పాఠశాలల్లోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయడం జరిగిందని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అలాగే జీవో నంబర్ 3 లేకుండా డీఎస్సీ నిర్వహించి గిరిజన నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వం మానుకోవాలని హితవుపలికారు.

గుమ్మలక్ష్మీపురం: గురుకులాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలు, జీపీఎస్ స్కూళ్లలో కొన్ని దశాబ్దాలుగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులను యథావిధిగా విధుల్లో కొనసాగించాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బొత్తాడ గౌరీశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులను వారి స్థానాల్లో నియమించడం ద్వారా వారి భవిష్యత్ ప్రశ్నార్థకమైందన్నారు. చాలా ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తినే నమ్ముకుని బతికిన వారిని రెగ్యులర్ చేయాల్సింది పోయి అన్యాయంగా వారిని రోడ్డున పడేయడం తగదన్నారు.

చురుగ్గా తాడికొండ జలపాతం అభివృద్ధి పనులు



తాడికొండ జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఏకైక పర్యాటక ప్రాంతంగా పేరొందిన తాడికొండ(మొగనాళి గెడ్డ) జలపాతం అభివృద్ధి పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి సెప్టెంబరు 19వ తేదీన ఈ జలపాతాన్ని పరిశీలించి, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో జలపాతం సందర్శనకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారికి మౌలిక సదుపాయాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ చేపట్టగా, ప్రకృతి అందాలు తిలకిస్తూ సందర్శకులు సేదతీరేందుకు హట్స్(గుడిసెలు) ఏర్పాటు చేసి వాటికి రంగులద్దుతున్నారు. పర్యాటకులకు స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్, కూల్‌డ్రింక్స్ అక్కడే దొరికేలా స్థానిక డ్వాక్రా మహిళా సంఘాలతో షాపు కూడా పెట్టిస్తున్నారు. ఇదే షాపును ఈ నెల 16వ తేదీన కలెక్టర్ ప్రారంభిస్తారని అధికారులు చెబుతున్నారు.

రెండో విడత ఉల్లాస్ శిక్షణ ప్రారంభం

గరుగుబిల్లి: నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేసే రెండో విడత ఉల్లాస్ శిక్షణ మండల కేంద్రంలో ఎంపీపీ ఉరిటి రామారావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో నిరక్షరాస్యులు లేకుండా చూడాల్సిన బాధ్యత వలంటీర్లదేనన్నారు. జిల్లా వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి 15 మంది నిరక్షరాస్యులకు ఒక వలంటీర్‌ను నియమించడం జరిగిందని, వారే వారిని అక్షరాస్యులుగా మలిచే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం వలంటీర్లకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఏపీఎం పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: వయోజనుల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మలిచేందుకు వలంటీర్లు కృషి చేయాలని ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం సతీష్ కోరారు. స్థానిక వెలుగు, ఎంపీడీవో కార్యాలయాల్లో వెలుగు, డీఆర్‌డీఏ వలంటీర్లకు ఉల్లాస్ శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు.

మన్యంలో సంప్రదాయ సాగు శుభపరిణామం

● కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్‌రెడ్డి



వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో రైతులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్‌రెడ్డి

సాలూరు:

మన్యం జిల్లాలో రైతులు సంప్రదాయ సేద్యం దిశగా అడుగులు వేయడం శుభపరిణామమని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని వ్యవసాయమార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సుమారు 67,000 ఎకరాల్లో సంప్రదాయ సేద్యం చేస్తున్నామన్నారు. ఇక్కడి రైతులకు సంప్రదాయ పద్ధతుల్లో పంటల్ని పండించడమే కాకుండా అంతరపంటల సాగుపై అవగాహన ఉందని కితాబిచ్చారు. రైతుకు లాభం చేకూర్చే వాణిజ్య పంటల గురించి వాటిలో అధిక దిగుబడులు ఏ విధంగా సాధించవచ్చో రైతులకు అవగాహన కలిగేలా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు ఆయన మండలంలోని మామిడిపల్లి ప్రాంతంలో పంటలను పరిశీలించారు. ప్రతి రైతు వ్యాపార వేత్తగా ఎదిగేలా చొరవ చూపాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కాగా మామిడిపల్లి పీహెచ్‌సీ భవన నిర్మాణం తుది దశ పనులు నిలిచిపోవడంతో నిర్మాణం పూర్తికాలేదని, వెంటనే ఈ భవనం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కలెక్టర్‌ను కోరారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సెక్షన్ అధికారులతో సమావేశం నిర్వహించి, మున్సిపాలిటీలో పలు అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి సంతోష్‌కుమార్, పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్ పిటిషన్లకు సత్వర పరిష్కారం



రెవెన్యూసిబ్బందితో సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ వైశాలి



పాచిపెంట: రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ వైశాలి

మక్కువ: పీజీఆర్‌ఎస్‌లో వచ్చే పిటిషన్లను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా సబ్‌కలెక్టర్ వైశాలి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆమె మక్కువ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించిన, అనంతరం వీఆర్వోలు, సర్వేయర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రీసర్వే చురుగ్గా జరిపించాలని సర్వేయర్లను ఆదేశించారు. అనంతరం ఎఫ్‌సీఐ గోదామును పరిశీలించారు. గోదాములో సరుకు నిల్వలు, రికార్డులు తనిఖీ చేశారు. అలాగే మక్కువ పీహెచ్‌సీని సందర్శించి వైద్యసిబ్బంది, రోగులతో మాట్లాడారు. మందుల నిల్వలపై ఆరా తీశారు. సబ్‌కలెక్టర్ వెంట, మక్కువ తహసీల్దార్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పాచిపెంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని పార్వతీపురం సబ్ కలెక్టర్ వైశాలి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే హరిత రహదారి సమీపంలో కొటికిపెంట రెవెన్యూ సర్వే నంబర్ 210లో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు కోసం పరిశీలించిన 45 ఎకరాల భూమికి సంబంధించి ఫారెస్ట్ శాఖ అభ్యంతరాలు ఉన్న నేపథ్యంలో, ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి, రెవెన్యూ ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రవి, హెచ్‌డీటీ, సీఎస్‌డీటీ, ఆర్ఐ రమణ, తదితరులు ఉన్నారు.

కాలేజీ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు

సీతానగరం: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పరిసరాల పరిశుభ్రత, విద్యార్థులకు మెరుగైన విద్యనందించడమే కాకుండా వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి (డీవీఈఓ) వై నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎల్.దాలినాయుడు ఆధ్వర్యంలో సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీవీఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి అవసర మైన చర్యలపై దృష్టిసారించాలని కోరారు. అధ్యాపకులకు సిలబస్, వీక్‌అండ్‌టెస్ట్, విద్యాబోధన, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం, విద్యార్థుల హాజరుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ల్యాబ్, తరగతిగదులు, కాలేజీ ప్రాంగణాన్ని పరిశీలించి ప్రిన్సి పాల్ దాలినాయుడుకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సురక్ష యాప్ ద్వారా మద్యం నాణ్యత తనిఖీ

సీతానగరం: ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రజలందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, పార్వతీపురం మన్యం జిల్లా ఆదేశాల మేరకు నూతనంగా అమలు చేస్తున్న సురక్ష యాప్‌ను ప్రజలు డౌన్‌లోడ్ చేసుకోవాలని, లైసెన్స్ ఎ4 షాపుల నుంచి మద్యం కొనుగోలు చేస్తున్న వారు ప్రతి మద్యం బాటిల్‌ను నిర్దేశించిన యాప్ ద్వారా స్కాన్ చేసుకుని మద్యం నాణ్యతను తనిఖీ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించరాదన్నారు. మద్యం షాపు యజమానులు నియమ నిబంధనలు పాటించాలని, మద్యం సీసాలను ఎంఆర్పీకే విక్రయించాలని సూచించారు. మద్యం విక్రయాల్లో ప్రజలనుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా శాఖాపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

అనుమతి లేకుండా కంకర తవ్వకాలు జరిపితే వాహనాలు సీజ్

మక్కువ: మైనింగ్‌శాఖ నుంచి అనుమతిలేకుండా కంకర తవ్వకాలు జరిపితే, వాహనాలు సీజ్ చేసేందుకు వెనకాడేదిలేదని తహసీల్దార్ భరత్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధి ఒడిసిలమెట్ట వద్ద అక్రమంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయంటూ మంగళవారం పలు పత్రికల్లో కథనాలు వెలువడడంతో, తహసీల్దార్ భరత్‌కుమార్ ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాశీపట్నం వద్ద కంకర తవ్వకాలు జరపడం వాస్తవమేనన్నారు. పత్రికల ద్వారా అందరికీ తెలియజేస్తున్నామని ఇకపై మైనింగ్‌శాఖ అనుమతి లేకుండా కంకర తవ్వకాలు జరిపి, పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సైన్స్ సెమినార్ రేపు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ సెమినార్ గురువారం నిర్వహించనున్నట్టు ఎంఈవోలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు తెలిపారు. స్థానిక ఎంఆర్‌సీలో వీరు విలేకరులతో మంగళవారం మాట్లాడారు. సెమినార్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే పాల్గొంటారని తెలిపారు. యూపీ, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఈ సెమినార్ నిర్వహిస్తామన్నారు.

పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎం



ఎస్‌బీఐ ఏటీఎం వద్ద విత్‌డ్రా కోసం నిరీక్షిస్తున్న ఖాతాదారులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలిలో భారతీయ స్టేట్ బ్యాంక్ యాజమాన్యం మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఏటీఎం కేంద్రం మొరాయించడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక స్టేట్ బ్యాంక్‌లో సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులకు అత్యవసర సమయంలో ఏటీఎం కేంద్రం రోజులో వందలాది మందికి ఉపయోగపడుతోంది. నాలుగు నెలలుగా ఏటీఎం పని చేయకపోవడం వల్ల ఇతర బ్యాంక్‌లకు సంబంధించిన ఏటీఎం కేంద్రాల్లో విత్‌డ్రా చేస్తుండడంతో డబ్బులు కట్ అయి పోతున్నాయని ఖాతాదారులు వాపోతున్నారు. ఏటీఎం కేంద్రంలో డబ్బుల లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేక పోయిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎస్‌బీఐ యాజమాన్యం స్పందించి ఏటీఎం పని చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కళాకారుడికి సన్మానం



బర్లిలో కళాకారుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామానికి చెందిన ప్రముఖ డోలక్ వాయిద్య కళాకారుడు రాయవలస సూర్యనారాయణను శ్రీవెంకటేశ్వర భజన బృందం , గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. 80సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయనను సన్మానించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలకు డోలక్ వాయించి మంచి పేరుప్రతిష్టలు సంపాదించిన గొప్ప వ్యక్తి అని గ్రామస్తులు ఆయనను పొగడ్తలతో ముంచెత్తారు. సన్మాన గ్రహీత సూర్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి కళలు అంతరించి పోకుండా బతికించాలని కోరారు. డోలక్ వాయించే వారి సంఖ్య తగ్గుతోందన్నారు. కార్యక్రమంలో బలిజిపేట సత్యసాయి సేవాసమితి కన్వీనర్ వి.సుబ్బారావు, పి.నారాయణరావు, పి.సత్యంనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ స్కూల్‌ను సందర్శించిన ఎంపీపీ



నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఓ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ బి.ప్రమీల వైస్ ఎంపీపీ నారాయణ

పాచిపెంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీపీ బి.ప్రమీల మంగళవారం సందర్శించారు, పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఓ ప్లాంట్‌ను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ...గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆర్వో ప్లాంట్ మరమ్మతుల బారిన పడితే కనీసం దాన్ని పట్టించుకున్న పరిస్థితులు లేవన్నారు. కలుషిత నీరు కారణంగా ఇటీవల కురుపాంలో గిరిజన విద్యార్థులు మృతి చెందిన సంఘటనను గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు రాకముందే మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ స్పందించి పాచిపెంట మండలంలో ఎక్కడెక్కడ ఆర్వో ప్లాంట్ లు నిరుపయోగంగా ఉన్నాయో వాటికి తక్షణమే మరమ్మతులు చేయించి సురక్షిత తాగునీరు విద్యార్థులకు అందజేయాలని సూచించారు. ఎంపీపీ వెంట వైస్ ఎంపీపీ మీసాల నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ



రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణ.శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలో ఇదివరలో పంపిణీ చేసిన రైస్ కార్డుల స్థానంలో కొత్త రేషన్‌స్మార్ట్ కార్డులను వినియోగదారులు అందిపుచ్చుకోవాలని వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు నిడగల్లులో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులను వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణ. గాజాపు శ్రీనివాసరావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రేషన్ వినియోగదారులకు పంపిణీ చేసిన రైస్‌కార్డుల స్థానంలో కొత్త రేషన్ (స్మార్ట్ రేషన్)కార్డులు వినియోగదారులకు రేషన్ డిపోల వారీగా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇళ్ల వద్దకు రేషన్ కార్డులతో వస్తున్న వారికి వినియోగదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డిపో డీలర్, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, వీర్వో పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యకర్తకు సన్మానం



సంజీవినాయుడిని సన్మానిస్తున్న యువత

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో పలు సేవాకార్య క్రమాలతో పాటు నేతాజీ గ్రంథాలయాన్ని నిర్వహిస్తూ అందరికీ పరోపకారిగా ఉంటున్న సామాజిక సేవా కార్యకర్త సంజీవినాయుడిని యువత మంగళవారం ఘనంగా సన్మానించారు. గడిచిన 30సంవత్సరాలుగా గ్రామంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాలు నిర్వహించడం, వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, నిరుపేదలకు అండగా ఉంటూ గ్రామంలో చందాలు సేకరించి వారికి అందించడం ఇటువంటి పలు సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్నందుకు యాతవీధి పెద్దలు, యువత, తెలగవీధి యవత సంజీవినాయడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ యువత, పెద్దలు సహకరించనిదే ఎవరూ ఎటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించలేరని తెలిపారు. తనకు సహకరిస్తున్న పెద్దలు, యువతకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దలు, యువత పాల్గొన్నారు.

‘కోటి సంతకాల సేకరణ’కు విశేష స్పందన

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్:

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో చేపట్టిన ‘కోటి సంతకాల సేకరణ’ ఉద్యమానికి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. నాలుగో రోజైన మంగళవారం ఈ కార్యక్రమాన్ని పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో గల కొత్తవలస ప్రాంతంలోను అలాగే పట్టణంలోని 11,12 వార్డుల్లో నిర్వహించారు. కోటి సంతకాల ఉద్యమం, ‘రచ్చబండ’ కార్యక్రమాలకు స్థానిక వార్డుల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ, పేద, బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్య, నాణ్యమైన వైద్యాన్ని దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తీవ్రంగా మండిపడ్డారు. ‘గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను మంజూరు చేశారని, వాటిలో ఇప్పటికే ఐదు కళాశాలలు ప్రారంభమై పేద విద్యార్థులకు వైద్య విద్యను అందిస్తున్నాయన్నారు. ఇప్పటికే 70శాతం పనులు పూర్తయిన మిగిలిన వైద్య కళాశాలలను కూడా కూటమి ప్రభుత్వం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సింది పోయి, వాటిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి భారీ అవినీతికి తెరలేపాలని చూస్తోందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని ప్రజల మద్దతుతో అడ్డుకుంటామని, ఈ కుయుక్తులను రాష్ట్ర ప్రజలు ఎంతమాత్రం హర్షించరని జోగారావు స్పష్టం చేశారు. దీనిలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంతకాల సేకరణ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వార్డు ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు పాత గౌరీశంకరరావు, మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ షఫీ, కౌన్సిలర్లు వండాన కృపాబాయి, సువ్వాడ లావణ్య, నిమ్మకాయల సుధీర్, సీనియర్ నాయకులు, వార్డుల ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంతకాలు చేస్తున్న యువత

ఆఖరి మజిలీకి తప్పని అవస్థలు



శ్మశానవాటిక సమీపంలో మరమ్మతుల బారిన పడిన షెల్టర్



శ్మశానవాటికు వెళ్లే రహదారి పరిధిలో ఉన్న పిచ్చిమొక్కలు

పార్వతీపురం: పట్టణ ప్రజలకు ఆఖరి మజిలీకి అవస్థలు తప్పడంలేదు. పట్టణంలోని బొగ్గులవీధి, పెద చాకలివీధి, వేమకోటివారివీధి, పాతరెల్లివీధి, తెలకలవీధి, కుసుమగుడ్డివారి వీధి, రామాపురం కాలనీ తదితర వీధులకు సంబంధించి ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు నిర్వహించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ శ్మశానవాటిక గీతా మందిరం సమీపంలోని గంగసాగరం చెరువు పక్కన ఉంది. అంత్యక్రియలు చేసేందుకు వెళ్లే మార్గంగుండా మలమూత్ర విసర్జన చేయడంతోపాటు మార్గానికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, తుప్పలు, డొంకలు ఉండడంతో రాకపోకలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రహదారి పరిధిలో పెద్ద పెద్ద బురద గుంతలుండడంతో నడిచేందుకు మరింత అవస్థలు పడుతున్నారు. ఎలాగోలా అష్టకష్టాలుపడి శ్మశానానికి వెళ్తే అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ గతంలో నిర్మించిన షెల్టర్ మరమ్మతుల బారిన పడడంతో పాటు కనీసం బోరు కూడా పనిచేయకపోవడంతో ప్రజల అవస్థలు వర్ణానాతీతంగా ఉన్నాయి. శ్మశాన వాటికలో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని 29వ వార్డు కౌన్సిలర్ యడ్ల త్రినాథరావు ఆరోపిస్తున్నారు.